రహదారుణాలు

- మట్టి రోడ్లను తలపిస్తున్న బీఆర్‌టీఎస్ రహదారులు
- అడుగడుగునా గోతులు.. వాహన చోదకుల పాట్లు
- రాత్రి వేళల్లో ప్రమాదాల బారిన ప్రయాణికులు
- సమస్యలు పట్టించుకోని అధికారులు


మద్రిపాలెం - 104 ఏరియాలో మట్టి రోడ్డును తలపిస్తున్న బీఆర్‌టీఎస్ రహదారి


కంచరపాలెం కూడలి - తాటిచెట్లపాలెం రహదారిలో ప్రమాదకరంగా గోతులు


ఊర్వశి జంక్షన్ నుంచి జాతీయ రహదారికి వెళ్లే బీటీ రోడ్డు దుస్థితి


తాటిచెట్లపాలెం - కంచరపాలెం రోడ్డులో గోతులు


అసంపూర్తిగా వదిలేసిన బీఆర్‌టీఎస్ రహదారి

కంచరపాలెం: జీవీఎంసీ 54, 55 వార్డుల పరిధిలోని బీఆర్‌టీఎస్ రహదారులు దారుణంగా తయారై మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. మద్రిపాలెం బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారి నుంచి కంచరపాలెం కూడలి మీదుగా తాటిచెట్లపాలేనికి వెళ్లే రహదారుల్లో 104 ఏరియా, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఐటీఐ జంక్షన్ కంచరపాలెం రైతుబజార్, ధర్మానగర్, తిక్కవానిపాలెం వద్ద బీఎస్‌టీఎస్ 1 కాలనీల వద్ద ఉన్న రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఇటు కంచరపాలెం నుంచి జ్ఞానాపురం భారతీయ ఆహార గిడ్డంగి రహదారి మీదుగా లోకోషెడ్ వాషింగ్ లైన్‌కు వెళ్లే రహదారుల్లో ప్రయాణమంటేనే వాహన చోదకులు, పాదచారులు, స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అటు ధర్మానగర్, తిక్కవానిపాలెం, తాటిచెట్లపాలెం జాతీయ రహదారి, గంగన్ననగర్, జోగారావునగర్ రైల్వే క్వార్టర్స్.. ఇటు కంచరపాలెం కూడలి ప్రాంతాలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో దీనిపై భారీ వాహనాల పార్కింగ్, విద్యుత్ లైట్లు లేకపోవడం, అధిక మలుపులు ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

గుంతలమయం..

మద్రిపాలెం నుంచి తాటిచెట్లపాలేనికి వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారుల్లో తారు కానరావడం లేదు. మూడేళ్ల కిందట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన రోడ్లకు గతేడాది కూటమి ప్రభుత్వంలో కొత్త రోడ్లు వేసినట్లు డబ్బాలు కొట్టుకొని అక్కడక్కడ పడిన గోతులను పూడ్చారు. వేసిన నాలుగు నెలలకే నాణ్యత డొల్లగా మారడంతో రహదారుల్లో భారీ గోతులు ఏర్పడ్డాయి. రాళ్లు తేలి మట్టి రోడ్లను తలపిస్తుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నామని ద్విచక్ర వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని, గోతుల రహదారిలో రాకపోకలు కష్టతరంగా మారుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టాల్సిన కూటమి పాలకులు కనిపించకపోవడంతో.. రోడ్లను బాగుచేసే వారు లేక ప్రజలు నానా పాట్లు పడుతున్నారు.

చీకట్లో ప్రమాదాలు

తాటిచెట్లపాలెం నుంచి కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కూడలికి రాకపోకలు సాగించే వాహన చోదకులు చీకట్లో ప్రయాణం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలు ఉన్నా.. అధికారులు లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి బీఆర్‌టీఎస్ రహదారిలో సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

రాకపోకలు సాగించలేకపోతున్నాం



బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారుల్లో గోతులు ఏర్పడి రాళ్లు తేలాయి. అటుగా వాహనాలపై రాకపోకలు సాగించే సమయంలో ఇబ్బంది పడుతున్నాం. కంచరపాలెం కూడలి నుంచి వెళ్లే రహదారుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. విద్యుత్ లైట్లు లేకపోవడంతో రాత్రిళ్లు పాదచారులు చీకట్లో ప్రయాణం సాగిస్తున్నారు. – వరలక్ష్మి, కంచరపాలెం

అధికారులు స్పందించాలి



కంచరపాలెం–మద్రిపాలెం బీఆర్‌టీఎస్ రహదారుల్లో ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తున్న వారు గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. చీకటి పడితే జ్ఞానాపురం, కంచరపాలెం నుంచి హైవే వైపు వెళ్లాలంటేనే భయంగా ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారులను బాగుచేయించాలి. – పి.సునీల్, వాహన చోదకుడు

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక


వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌తో కె.కె.రాజు, సాడి పద్మారెడ్డి

తాటిచెట్లపాలెం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. తాజాగా జరిగిన జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి విజయం సాధించిన సాడి పద్మారెడ్డి కె.కె.రాజుతో కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో వైఎస్ జగన్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా పద్మారెడ్డికి ఆయన అభినందనలు తెలియజేశారు.

కల్వర్టు పరిశీలన


గెడ్డ వద్ద కుంగిన కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతంపేట: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా 25వ వార్డులోని పద్మశాలి భవనం పక్కనున్న గెడ్డ కల్వర్టు కుంగిపోయింది. దీనిని మంగళవారం ఉదయం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పరిశీలించారు. గెడ్డపై కొత్తగా బాక్సు కల్వర్టు నిర్మించి సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఈఈ విజయకుమార్, ఏఈ నిహారిక, పద్మశాలి భవన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్టర్ కూటికుప్పలకు సోదర వియోగం


మురళీనగర్: పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావుకు సోదర వియోగం కలిగింది. అయ్యప్పనగర్‌లో నివసిస్తున్న ఆయన సోదరుడు అప్పారావు సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు అప్పారావు మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. సోదర వియోగంతో బాధపడుతున్న కూటికుప్పల సూర్యారావును ఓదార్చారు. పోర్టు ఉద్యోగిగా పదవీ విరమణ చేసిన అప్పారావు కుటుంబాన్ని పోర్టు ఉద్యోగులు కలిసి సంతాపం తెలిపారు. మాధవధార శ్మశానవాటికలో అప్పారావు అంత్యక్రియలు నిర్వహించారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మాత్రలు వేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎం

తాటిచెట్లపాలెం: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు సూచించారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు మింగించారు. పిల్లలు ఎంత తింటే అంత పెట్టాలని, వయసుకు తగ్గ ఎత్తు, బరువు ఉండాలని తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి అల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మాలా బీబీ, ఏఎన్‌ఎం మేరి, ఆశా వర్కర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేవీలో ఉత్సాహంగా శిక్షణ తరగతులు


వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

తాటిచెట్లపాలెం: స్థానిక కేంద్రీయ విద్యాలయ–వాల్తేర్‌లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం పలు అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కిట్ ఇన్‌స్పెక్షన్, బీపీ ఎక్సర్‌సైజ్‌లతో తరగతులను ప్రారంభించారు. బుల్‌బుల్ రింగ్, సింగ్‌సాంగ్ వంటి పాటలు, ఆటలతో చిన్నారులు అలరించారు. ముఖ్య అతిథి ఎస్ఎస్ మూర్తి తన అనుభవాలను స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో పంచుకున్నారు. సాయంత్రం ఉత్సాహంగా క్యాంప్‌ఫైర్ కార్యక్రమం నిర్వహించారు. లీడర్ ఆఫ్ ది క్యాంప్(ఎల్‌వోసీ) జ్యోతి, సుధా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సి.ఎస్.రావు సేవలు నిరుపమానం


సి.ఎస్.రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: సహృదయ సాహితి, సి.ఎస్.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంఘ సేవకుడు, ప్రజా స్పందన అధ్యక్షుడు సి.ఎస్.రావు 95వ జయంతి సభ మంగళవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథి గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ పౌర జీవనంలో రెండు దశాబ్దాల పాటు అనేక సామాజిక అంశాలపై పోరాడిన సి.ఎస్.రావు ప్రజల మనిషి అని కొనియాడారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పాత జైలు స్థలం ఆయన పోరాటంతో నేడు సెంట్రల్ పార్కుగా అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సి.ఎస్.రావు కార్యదీక్ష పరుడని, వృద్ధాప్యంలో నిరాహార దీక్ష చేసిన ధీరుడని కొనియాడారు. ఆయని జీవిత చరిత్ర రాయడం తన అదృష్టంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్, ఫౌండేషన్ ప్రతినిధి చాగంటి జోగారావు, సిహెచ్.చినసూర్యనారాయణ పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో నులిపురుగులు దూరం


విద్యార్థినితో మాత్ర మింగిస్తున్న ఉపాధ్యాయుడు


ఎన్‌జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో నులి పురుగుల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం రాధాకుమారి

సీతంపేట: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి మాట్లాడుతూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఏదైనా తినేముందు పరిశుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. మల విసర్జన తర్వాత, పిల్లలు ఆటలు ఆడిన తర్వాత చేతులను సబ్బుతో కడుక్కోవాలన్నారు. చేతి గోళ్లను కత్తిరించుకుని, వాటిలో మట్టి లేకుండా శుభ్రం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అపరిశుభ్రమైన చేతుల వల్ల నోటి ద్వారా నులి పురుగుల గుడ్లు శరీరంలోకి ప్రవేశించి పేగుల గోడలకు అంటుకుని రక్తాన్ని పీల్చివేస్తాయని, తద్వార రక్తహీనత, ఆకలి లేమి, శరీర ఎదుగుదల మందగించడం జరుగుతాయన్నారు. ఏడాదికి ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వల్ల నులి పురుగులను నిర్మూలించ వచ్చని చెప్పారు. మధ్యాహ్నం భోజనం తర్వాత పిల్లలకు మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మాస్టర్ ఇ.కె. శత జయంత్యుత్సవాలు ప్రారంభం


శిక్షణ పొందిన మహిళలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న నిర్వాహకులు


మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: లోక క్షేమం కోసం తన జీవితాన్ని సమర్పించి భౌగోళికంగా వేలాది మందిని సన్మార్గం వైపు నడిపించిన మహోన్నతుడు మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య(ఇ.కె.) అని జగద్గురు పీఠం (ది వరల్డ్ టీచర్ ట్రస్ట్) జాతీయ సలహా మండలి సభ్యుడు సీహెచ్ఎస్ఎన్ రాజు అన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె. సంస్కృతి సదన్‌లో మంగళవారం ప్రారంభమైన మాస్టర్ ఇ.కె. శత జయంతి ఉత్సవ సభలో ఆయన ముఖ్య ప్రసంగం చేశారు. దేశవిదేశాల్లో 2026 ఆగస్టు 11 వరకు జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ట్రస్ట్ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ సామాన్యులకు నిస్వార్థంగా సేవలందించడమే మాస్టర్ ఇ.కె. సంస్కృతి సదన్ పరమావధని పేర్కొన్నారు. వృత్తి విద్యల్లో ఇంతవరకు సుమారు 2 వేల మంది మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. సంస్థ కార్యదర్శి బి.ఆర్.కె.రాజు మాట్లాడుతూ మాస్టర్ ఇ.కె. నిర్వహించిన గురుపూజా ఉత్సవాలు నేడు అనేక కేంద్రాలకు విస్తరించాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా టైలరింగ్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ వంటి అంశాల్లో శిక్షణ పొందిన 65 మంది మహిళలకు ధ్రువ పత్రాలు, 11 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహక సభ్యురాలు బి.ఉషారాణి, పప్పు రవిశంకర్, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సిహెచ్.శ్రీనివాసరాజు, రామానుజ పీఠం స్థానిక కార్యదర్శి ఎ.జి.కె.రాజు, సంగీత జనకులం అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గణేష్‌కుమార్ తదితరులు

మహారాణిపేట: వార్డు పరిపాలనా కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీజే గణేష్ కుమార్ కోరారు. మంగళవారం జీవీఎంసీ రెవెన్యూ డిప్యూటీ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. గత నెల 30న విడుదలైన తాత్కాలిక సీనియారిటీ జాబితాలో హాల్ టికెట్ నంబర్లు, ర్యాంకులు, మార్కుల్లో ఉన్న తప్పులను సరిచేసి కచ్చితమైన మెరిట్–కమ్–సీనియారిటీ జాబితాను ప్రకటించాలని కోరారు. ఫీల్డ్ స్థాయి సూచనలను చేర్చేలా యూనిఫైడ్ సర్వీస్ రూల్స్‌పై ఇంటరాక్టివ్ సమావేశం నిర్వహించాలన్నారు. తరచుగా జరుగుతున్న డోర్–టు–డోర్ సర్వేలు సిబ్బందికి ఒత్తిడి, ప్రజల్లో అసంతృప్తి కలిగిస్తున్నాయని తెలిపారు. రెవెన్యూ డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర ట్రెజరర్ చింతకాయల బంగారురాజు, జిల్లా నాయకులు ఎస్. సాయికృష్ణ, డి. రవితేజ, ఎస్. నానాజీ తదితరులు ఉన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో 'తిరంగా' రెపరెపలు


స్కిట్‌ను వీక్షిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, రైల్వే అధికారులు


రైల్వే స్టేషన్ వద్ద స్కిట్ ప్రదర్శిస్తున్న డివిజనల్ కల్చరల్ బృంద సభ్యులు


ఎలక్ట్రికల్ లోకో షెడ్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో హర్ ఘర్ తిరంగా వేడుకలు ఉత్సాహంగా సాగుతున్నాయి. జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులు, అధికారులు, చిన్నారులు పలు ప్రత్యేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఎలక్ట్రికల్ లోకో షెడ్ సిబ్బంది సీనియర్ డీఈఈ బి.ఎస్.రావు, డీఈఈ ఆర్.డి.సాహూ నేతృత్వంలో మంగళవారం బహిరంగ ర్యాలీ నిర్వహించారు. డివిజనల్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ రైల్వే స్టేషన్ గేట్ నంబర్ 2 వద్ద పలు దేశభక్తి గీతాలు ఆలపించారు. స్వచ్ఛ భారత్–స్వచ్ఛ రైల్‌లో భాగంగా స్వచ్ఛతపై స్కిట్‌లు ప్రదర్శించారు. కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన డీఆర్‌ఎం లలిత్ బోహ్రా.. డివిజనల్ కల్చరల్ అసోసియేషన్ బృంద సభ్యులను అభినందించారు.

బుల్స్‌పై రాయల్స్ విజయం



147 పరుగుల అజేయ భాగస్వామ్యంతో విజయకేతనం ఎగురవేసిన రికీబుయ్, వీరారెడ్డి జోడి

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో భాగంగా మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో అమరావతి రాయల్స్ 3 వికెట్ల తేడాతో భీమవరం బుల్స్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బుల్స్ 4 వికెట్లు కోల్పోయి 191 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో హిమకర్ (81), రేవంత్ (69) రాణించారు. ప్రతిగా రాయల్స్ మరో రెండు బంతులుండగానే ఏడు వికెట్లు కోల్పోయి 193 పరుగులు చేసి విజయాన్నందుకుంది. కెప్టెన్ హనుమవిహారి (37), పాండురంగరాజు (20), రాహుల్(52), విజయ్(36), అయ్యప్ప(26) రాణించారు.

గర్జించిన వైజాగ్ లయన్స్

మరో మ్యాచ్‌లో వైజాగ్ లయన్స్ జట్టు విజయవాడ సన్ షైనర్స్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌షైనర్స్ 8 వికెట్లకు 185 పరుగులు చేసింది. కెప్టెన్ అశ్విన్‌హెబ్బర్(30), అభినవ్(29), తేజ(33), కెఎస్ఎన్ రాజు(53) రాణించారు. యశ్వంత్ 4 వికెట్లు, సాయితేజ రెండు వికెట్లు తీశారు. ప్రతిగా వైజాగ్ లయన్స్ వీరారెడ్డి(104) సెంచరీతోను, రికీబుయ్(58)అర్ధసెంచరీతో రాణించి విజయతీరాలకు చేర్చారు.

సాంకేతికతపై దృష్టి సారించండి


ప్రసంగిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

సీతంపేట: దేశ ఆర్థిక వ్యవస్థ ఏడాదికి 7 నుంచి 8 శాతం వృద్ధి సాధిస్తోందని, ఇది యువతకు అపారమైన అవకాశాలను అందిస్తోందని డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) లలిత్ బోహ్రా అన్నారు. స్థానిక డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో మంగళవారం కెరీర్ ప్లానింగ్‌పై ఆయన ప్రసంగించారు. భావితరాలు అభివృద్ధి చెందిన దేశంలో భాగమవుతాయన్నారు. విద్యార్థులు సాంకేతికతను సృష్టించడం, అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాలని ఇంజినీరింగ్ విద్యార్థులకు సూచించారు. ప్రతి విషయాన్ని జిజ్ఞాసతో నేర్చుకోవడం, ప్రశ్నించడం, ఆసక్తి, కష్టపడటం, దృష్టి విజయానికి బాటలు వేస్తాయన్నారు. ఇంటర్‌నెట్ సదుపాయాన్ని వ్యక్తిగత అభివృద్ధి, కొత్త విషయాలు నేర్చుకోవడానికి సద్వినియోగం చేసుకోవాలన్నారు. నైపుణ్యాభివృద్ధి నిరంతర ప్రక్రియ కావాలని, ఇంటర్న్‌షిప్‌ల ద్వారా పొందే ప్రాక్టికల్ అనుభవం అమూల్యమని, కెరీర్ పురోగతికి కమ్యూనికేషన్ నైపుణ్యం కీలకమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

అల్లిపురం: ర్యాగింగ్ ఓ విష సంస్కృతి అని, ర్యాగింగ్‌కు పాల్పడినా.. ఈవ్ టీజింగ్ చేసినా నేరమని, దీనికి దూరంగా ఉండాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. కళాశాలల్లో ఇవి సహజమంటూ తేలిగ్గా తీసుకుంటే దుష్ఫలితాలు వేరుగా ఉంటాయని హెచ్చరించారు. యాంటీ ర్యాగింగ్ వీక్ సందర్భంగా ఏవీఎన్ కాలేజ్ ప్రిన్సిపాల్ సింహాద్రి నాయుడు సమన్వయంతో, వన్‌టౌన్ సీఐ జి.డి.బాబు ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి సీపీ కలిసి నడుస్తూ 'ర్యాగింగ్ వద్దు–చదివే ముద్దు', 'ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు' వంటూ నినాదాలు చేశారు.